రైజర్స్ అదుర్స్

చెపాక్‌లో చెన్నైపై తొలి విజయం

మెరిసిన హర్షల్, ఇషాన్, కమిందు

చెన్నై: వరుసగా రెండు ఓటముల తర్వాత ఐపీఎల్-18లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) తిరిగి విజయాల బాట పట్టింది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంతితో పాటు బ్యాట్‌తోనూ సమిష్టిగా రాణించిన సన్‌రైజర్స్.. చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే)ను 5 వికెట్ల తేడాతో ఓడించి ఈ సీజన్‌లో మూడో విజయాన్ని నమోదుచేసింది. చెపాక్‌లో చెన్నైపై సన్‌రైజర్స్‌కు ఇది తొలి విజయం కావడం విశేషం. లో స్కోరింగ్ మ్యాచ్‌లో సీఎస్‌కే నిర్దేశించిన 155 పరుగుల ఛేదనను ఆ జట్టు.. 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 44, 5 ఫోర్లు, 1 సిక్స్), కమిందు మెండిస్ (22 బంతుల్లో 32 నాటౌట్, 3 ఫోర్లు) రాణించారు. మొదట హైదరాబాద్ బౌలర్లు కట్టడి చేయడంతో చెన్నై.. 19.5 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌట్ అయింది. హర్షల్ పటేల్ (4/28), పాట్ కమిన్స్ (2/21), జయదేవ్ ఉనద్కత్ (2/21) ఆతిథ్య జట్టును భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. ఈ సీజన్‌లో చెన్నైకి తొలి మ్యాచ్ ఆడుతున్న డెవాల్డ్ బ్రెవిస్ (25 బంతుల్లో 42, 1 ఫోర్, 4 సిక్సర్లు), అయుశ్ మాత్రె (19 బంతుల్లో 30, 6 ఫోర్లు) సీఎస్‌కేను ఆదుకున్నారు. ఈ సీజన్‌లో చెన్నైకి ఇది ఆడిన 9 మ్యాచ్‌లకు గాను ఏడో ఓటమి. ఈ ఫలితంతో ప్లేఆఫ్ రేసు నుంచి ఆ జట్టు అధికారికంగా నిష్క్రమించినట్టే.

మెరిసిన ఇషాన్, మెండిస్

స్వల్ప ఛేదనలో హైదరాబాద్ ఇన్నింగ్స్ కూడా చెన్నై మాదిరిగానే సాగింది. ఖలీల్ రెండో బంతికే ప్రమాదకర అభిషేక్ శర్మను ఔట్ చేసి సీఎస్‌కేకు తొలి బ్రేక్‌చ్చాడు. నాలుగు బౌండరీలతో కుదురుకున్నట్టే కనిపించిన ఇంపాక్ట్ ప్లేయర్ ట్రావిస్ హెడ్ (19).. అన్షుల్ ఆరో ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయి మళ్లీ నిరాశపరిచాడు. నాలుగో స్థానానికి ప్రమోట్ అయిన క్లాసెన్ (7)ను జడ్డూ బోల్తా కొట్టించాడు. అయితే ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ సెంచరీ తర్వాత వరుసగా విఫలమైన ఇషాన్.. చెన్నైతో పోరులో మాత్రం బాధ్యతాయుతంగా ఆడాడు. రెండో వికెట్‌కు హెడ్‌తో 37 పరుగులు, మూడో వికెట్‌కు అనికేత్‌తో 36 రన్స్ జత చేసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పాడు. తన శైలికి భిన్నంగా ఆడిన ఇషాన్.. అర్ధశతకానికి సమీపిస్తున్న క్రమంలో నూర్ అహ్మద్ వరుస ఓవర్లలో ఎస్‌ఆర్‌హెచ్‌కు రెండు షాకులిచ్చాడు. 12వ ఓవర్లో 44 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఇషాన్‌ను ఔట్ చేసిన అతడు.. మరుసటి ఓవర్లో అనికేత్‌నూ పెవిలియన్‌కు పంపి చెన్నైలో గెలుపు ఆశలు రేపాడు. కానీ మెండిస్, నితీశ్ రెడ్డి (19 నాటౌట్).. ఎలాంటి సంచలనాలకూ తావివ్వకుండా లాంఛనాన్ని పూర్తి చేశారు.

చెన్నైది అదే కథ

ఈ సీజన్‌లో బ్యాటింగ్ వైఫల్యాలతో తేలిపోతున్న సీఎస్‌కే.. హైదరాబాద్‌తో మ్యాచ్‌లోనూ దానినే కొనసాగించింది. ఇన్నింగ్స్ తొలి బంతికి వికెట్ కోల్పోయిన ఆ జట్టు.. పడుతూ లేస్తూ నామమాత్రపు స్కోరు సాధించింది. చెన్నైకి ఆడుతున్న అరంగేట్ర ఆటగాడు బ్రెవిస్, ఇటీవలే ఆ జట్టుకు ఎంట్రీ ఇచ్చిన అయుశ్ ఇద్దరే ఫర్వాలేదనిపించారు. ఈ మ్యాచ్‌తో మళ్లీ ఎస్‌ఆర్‌హెచ్ తుది జట్టులోకి వచ్చిన షమీ.. తొలి బంతికే షేక్ రషీద్‌ను డకౌట్ చేసి సీఎస్‌కేను ఆరంభంలోనే దెబ్బకొట్టాడు. మూడో స్థానంలో సామ్ కరన్ (9)ను ఆడించినా అతడూ విఫలమయ్యాడు. హర్షల్ ఐదో ఓవర్లో కరన్.. అనికేత్‌కు క్యాచ్ ఇచ్చాడు. కానీ అయుశ్ మాత్రం ఆత్మవిశ్వాసంతో బ్యాటింగ్ చేశాడు. బౌండరీతో పరుగుల వేటను ప్రారంభించిన ఈ మహారాష్ట్ర కుర్రాడు.. కమిన్స్, ఉనద్కత్ బౌలింగ్‌లో బ్యాక్ టు బ్యాక్ బౌండరీలు రాబట్టాడు. కానీ కమిన్స్.. ఆరో ఓవర్లో అయుశ్‌ను ఔట్ చేయడంతో చెన్నై కష్టాల్లో చిక్కుకుంది. ఈ క్రమంలో క్రీజులోకి వచ్చిన బ్రెవిస్.. జడేజా (21)తో కలిసి కొద్దిసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. అయితే మెండిస్.. పదో ఓవర్లో అద్భుతమైన బంతితో జడ్డూను క్లీన్‌బౌల్డ్ చేశాడు. 17 బంతుల్లో 17 పరుగులే చేసిన బ్రెవిస్.. మెండిస్ 12వ ఓవర్లో జూలు విదిల్చాడు. తన ట్రేడ్ మార్క్ షాట్ అయిన 'నో లుక్ సిక్స్'తో పాటు మరో రెండు సిక్సర్లు దంచడంతో చెన్నై స్కోరు 100 దాటింది. కానీ హర్షల్ మరుసటి ఓవర్లో లాంగాఫ్ వద్ద మెండిస్ కళ్లుచెదిరే డైవింగ్ క్యాచ్‌తో బ్రెవిస్ ఇన్నింగ్స్ ముగిసింది. శివమ్ దూబే (12), ధోనీ (6) విఫలమవగా ఆఖర్లో దీపక్ హుడా (22) కీలక పరుగులు జతచేశాడు. స్పిన్‌కు సహకరించే చెపాక్ పిచ్‌పై ఎస్‌ఆర్‌హెచ్ పేసర్లు ఏకంగా 9 వికెట్లు పడగొట్టడం విశేషం. అదీగాక ఈ సీజన్‌లో ఒక జట్టును ఆలౌట్ చేయడం హైదరాబాద్‌కు ఇదే ప్రథమం.

హర్షల్ (4/28)

400 క్లబ్‌లో మహీ

ఈ మ్యాచ్‌తో ధోనీ తన సుదీర్ఘ కెరీర్‌లో మరో మైలురాయిని చేరుకున్నాడు. టీ20లలో మహీకి ఇది 400వ మ్యాచ్. భారత్ నుంచి ఈ రికార్డు సాధించినవారిలో అతడు నాలుగో క్రికెటర్. ఈ జాబితాలో రోహిత్ శర్మ (456 మ్యాచ్‌లు), దినేశ్ కార్తీక్ (412), విరాట్ కోహ్లీ (408).. ధోనీ కంటే ముందున్నారు. ఈ ఫార్మాట్‌లో ధోనీ.. 7,500కు పైగా పరుగులు చేశాడు.

సంక్షిప్త స్కోర్లు

చెన్నై: 20 ఓవర్లలో 154 ఆలౌట్ (బ్రెవిస్ 42, అయుష్ 30, హర్షల్ 4/28, కమిన్స్ 2/21); **హైదరాబాద్:** 18.4 ఓవర్లలో 155/5 (ఇషాన్ 44, మెండిస్ 32*, నూర్ 2/42, కంబోజ్ 1/16)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	8	6	2	12	1.10
ఢిల్లీ	8	6	2	12	0.65
బెంగళూరు	9	6	3	12	0.48
ముంబై	9	5	4	10	0.67
పంజాబ్	8	5	3	10	0.17
లక్నో	9	5	4	10	-0.05
కోల్‌కతా	8	3	5	6	0.21
హైదరాబాద్	9	3	6	6	-1.10
రాజస్థాన్	9	2	7	4	-0.62
చెన్నై	9	2	7	4	-1.30

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

ఏషియన్ టోర్నీకి నిత్య, నందిని

59 మందితో భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: దక్షిణకొరియా వేదికగా జరుగనున్న ఏషియన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ కోసం భారత అథ్లెటిక్స్ సమాఖ్య(ఏఎఫ్ఐ) 59 మందితో జట్టును శుక్రవారం ఎంపిక చేసింది. కొచ్చిలో తాజాగా ముగిసిన ఫెడరేషన్ కప్ సీనియర్ అథ్లెటిక్స్ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచిన వారిని ఏషియన్ చాంపియన్‌షిప్‌నకు పరిగణనలోకి తీసుకున్నారు. తెలంగాణ నుంచి నిత్య గాదెతో పాటు అగసర నందిని భారత అథ్లెటిక్స్ జట్టులో చోటు దక్కించుకున్నారు. మహిళల 200మీటర్ల రేసుతో పాటు 4X 100 రిలే రేసులో నిత్య బరిలో దిగనుండగా, హెప్టాథ్లాన్‌లో నందిని పోటీపడనుంది. ఇదిలా ఉంటే స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా..ఏషియన్ అథ్లెటిక్స్ టోర్నీ నుంచి తప్పుకున్నాడు. చివరి సారి 2017లో ఆడిన నీరజ్..ప్రతిష్ఠాత్మక టోర్నీలై డైమండ్ లీగ్‌తో పాటు ప్రపంచ చాంపియన్‌షిప్‌లపై దృష్టి సారించాడు. దీనికి తోడు వచ్చే నెల బెంగళూరులో జరుగనున్న 'నీరజ్ చోప్రా' క్లాసిక్ టోర్నీ కోసం నీరజ్ సిద్ధమవుతున్నాడు. షాట్‌పుటర్ తజిందర్‌పాల్‌సింగ్‌తో పాటు పోల్‌వాల్టర్ దేవ్‌కుమార్‌మీనా భారత జట్టులో చోటు దక్కించుకోపోగా, అవినాశ్ సాబ్లె, పారుల్ చౌదరి, గుల్వీర్‌సింగ్, జ్యోతి యర్రాజీ, ప్రవీణ్ చిత్రవేల్ సత్తాచాటేందుకు తహతహలాడుతున్నారు.

సెమీస్‌కు మరో 8 మంది బాక్సర్లు

అమ్మాన్ (జోర్డాన్): ఏషియన్ అండర్-15, 17 బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో మరో 8 మంది యువ భారత బాక్సర్లు సెమీస్‌కు చేరారు. గురువారం రాత్రి జరిగిన క్వార్టర్స్ పోటీల్లో భాగంగా పురుషుల విభాగంలో టికమ్ సింగ్, అంబేకర్, అమన్ దేవ్, ఉద్భమ్ సింగ్, రాహుల్ గెరియా సెమీస్‌కు అర్హత సాధించారు. మహిళల విభాగంలో.. ఖుషీ చంద్, జియా, జన్నత్ లాస్ట్-8కు దూసుకెళ్లారు.

ఆసియా రేసింగ్‌లో జోహాన్, కెవిన్

ముంబై: ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్ కోసం రంగం సిద్ధమైంది. థాయ్‌లాండ్ వేదికగా ఈనెల 27వ వరకు జరుగనున్న రేసింగ్ కోసం హోండా ప్రకటించిన జట్టులో భారత్ నుంచి జోహాన్ రీవ్స్, కెవిన్ కింటాల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆసియాలోనే అత్యంత పోటీ ఉండే రేసింగ్ సర్క్యూట్లలో ఒకటైన థాయ్‌లాండ్ రేసింగ్‌లో జోహాన్, కెవిన్..అంతర్జాతీయ రేసర్లతో పోటీపడనున్నారు. 2025 ఎఫ్ఐఎమ్ ఆసియా రోడ్ రేసింగ్ చాంపియన్‌షిప్‌లో మొత్తం ఆరు రౌండ్లు జరుగనున్నాయి. థాయ్‌లాండ్‌లోని చాంగ్ ఇంటర్నేషనల్ సర్క్యూట్‌లో తొలి రౌండ్ మొదలుకానుంది. కెవిన్ ఇప్పటికే ఏఆర్ఆర్‌సీ సీజన్లలో అనుభవం పొందిన రైడర్ కాగా, జోహాన్ మాత్రం తొలిసారి అంతర్జాతీయ టోర్నీలో పోటీపడుతున్నాడు.

అర్షద్‌ను తోటి అథ్లెట్‌గానే ఆహ్వానించా..

దేశ ప్రయోజనాలే నా మొదటి ప్రాధాన్యత • స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా వివరణ

ఢిల్లీ: వచ్చే నెలలో బెంగళూరు వేదికగా జరుగనున్న నీరజ్ చోప్రా క్లాసిక్ (ఎన్‌సీ క్లాసిక్-2025) ఈవెంట్‌కు పాకిస్థాన్ జావెలిన్ త్రోయర్ అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై భారత గోల్డెన్ బాయ్ స్పందించాడు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఎన్‌సీ క్లాసిక్‌కు పాక్ అథ్లెట్‌ను పిలవడాన్ని నిరసిస్తూ చాలా మంది నెటిజన్లు నీరజ్‌పై దుమ్మెత్తిపోస్తున్నారు. తాజాగా నీరజ్.. ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సుదీర్ఘమైన లేఖలో తన ఆవేదనను వ్యక్తం చేస్తూ వివరణ ఇచ్చాడు. 'ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్‌కు అర్షద్‌ను ఆహ్వానించడంపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతున్నది. అందులో ఎక్కువ భాగం ద్వేషం, అసభ్యకరమైనవే ఉన్నాయి. వాళ్లు నా కుటుంబాన్నీ విడిచిపెట్టలేదు. ఈ ఈవెంట్‌లో పాల్గొనబోయే క్రీడాకారులకు సోమవారమే (పహల్గాం ఉగ్రదాడికి ముందు) ఆహ్వానం పంపాం. అగ్రశ్రేణి అథ్లెట్లను భారత్‌కు రప్పించి ప్రపంచస్థాయిలో నిర్వహించగలమని చాటిచెప్పడమే ఎన్‌సీ క్లాసిక్ ఉద్దేశం. కానీ ఈ 48 గంటల్లో చాలా మార్పులు జరిగాయి. అర్షద్ ఈ ఈవెంట్‌కు హాజరుకావడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. నాకు నా దేశ ప్రయోజనాలే మొదటి ప్రాధాన్యత. పహల్గాం ఘటనపై నాకు బాధతో పాటు కోపమూ ఉంది. భారత్ గర్వపడేలా చాలా ఏండ్లుగా కష్టపడుతున్నా. కానీ ఇప్పుడు నా చిత్తశుద్ధిని ప్రశ్నించడం బాధాకరంగా ఉంది. నాతో పాటు ఇంట్లో మా అమ్మనూ వాళ్లు వదల్లేదు. గతంలో ఆమె అమాయకంగా చెప్పిన మాటలను ప్రశంసించినవాళ్లే ఇప్పుడు అసభ్యకరమైన పదజాలంతో దూషిస్తున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను ఇలా ఎలా మార్చుకుంటారో అర్థం కావడం లేదు. ఏదేమైనా ప్రపంచస్థాయిలో నా దేశాన్ని గర్వంగా నిలిపేందుకు నేను ఎల్లవేళలా కష్టపడతా. జైహింద్' అని రాసుకొచ్చాడు.